RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006 9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక



సంపుటి - 02 సంచిక - 21 పేజీలు - 04 వెల - 04/- గురువారం17 అక్టోబర్ 2024


## ఒకేసారి ఆరు కొత్త

# పాలసీలు..!!



**సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ క్యాబినెట్ సమావేశం**

**భేటీ ముగిసిన అనంతరం చంద్రబాబు ప్రెస్ మీట్**

**పవర్ పాయింట్ ప్రజంటేషన్ తో వివరాలు వెల్లడి**

అమరావతి,అక్టోబర్16ఆంధ్ర ప్రగతి : ఏపీ క్యాబినెట్ సమావేశం ముగిసిన అనంతరం సీఎం చంద్రబాబు స్వయంగా మీడియా ముందుకు వచ్చారు. మీడియా సమావేశంలో ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒకేసారి ఆరు కొత్త పాలసీలు తీసుకువచ్చామని వెల్లడించారు.

1. ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్ మెంట్ పాలసీ
2. ఏపీ ఎంఎస్ఎంఈ, ఎంటర్ ప్రెన్యూర్ డెవలప్ మెంట్ పాలసీ
3. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ
4. ఏపీ ఎలక్ట్రానిక్స్ పాలసీ
5. ఏపీ ప్రైవేటు పార్కుల పాలసీ
6. ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ...

తీసుకువచ్చినట్టు వివరించారు.

క్యాబినెట్ సమావేశంలో ఈ ఆరు కొత్త పాలసీలపై చర్చించి ఆమోదం తెలిపామని చంద్రబాబు పేర్కొన్నారు. థింక్ గ్లోబల్లీ, యాక్ట్ గ్లోబల్లీ అనేది తమ నినాదం అని తెలిపారు. రాబోయే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా తమ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ ప్రెన్యూర్ అనేది తమ ప్రభుత్వ నినాదమని చంద్రబాబు తెలిపారు. కుటుంబానికో పారిశ్రామికవేత్త ఉండడమే తమ విజన్ అని, ఉద్యోగాలు చేయడం కాదు, ఉద్యోగాలు ఇచ్చే పరిస్థితి రావాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నికల వేళ మేనిఫెస్టోలోనూ తాము ఇదే చెప్పామని గుర్తు చేశారు.

పెట్టుబడులు తీసుకువస్తాం... అభివృద్ధి చేస్తాం... సంపద పెంచుతాం... పెంచిన ఆదాయం పేదలకు సంక్షేమ రూపంలో అందిస్తాం అని పునరుద్ఘాటించారు. ముఖ్యంగా విదేశీ పెట్టుబడులు రాబట్టడంపై దృష్టి సారిస్తామని, తీవ్రస్థాయిలో దెబ్బతిన్న ఏపీ బ్రాండ్ ను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.


“నాలెడ్జ్ ఎకానమీ, అగ్రికల్చర్, ఆక్వా, హార్టికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలు మన రాష్ట్ర బలాలు. పెట్టుబడి రహిత ప్రకృతి వ్యవసాయాన్ని మరింతగా ప్రోత్సహిస్తాం. ఎంఎస్ఎంఈలను భారీ ఎత్తున ముందుకు తీసుకెళతాం... ప్రతి కుటుంబం ఒక చిన్న తరహా పరిశ్రమ పెట్టేలా ప్రోత్సహిస్తాం. అందుకోసం ప్రభుత్వమే శిక్షణ ఇచ్చి, సాయం చేస్తుంది. ఇక, రాయలసీమను ఆటోమొబైల్ హబ్ గా తీర్చిదిద్దుతాం. రాయలసీమ ప్రాంతానికి ఉన్న అనుకూలతను సద్వినియోగం చేసుకుంటాం. ఇక్కడ భూమి ఉంది, నీళ్లు ఉన్నాయి, కరెంటు ఉంది...

**మిగతాది 2లో...**

## తీరం వైపు దూసుకొస్తున్న

# తీవ్ర వాయుగుండం

**దక్షిణ కోస్తా, రాయలసీమలో భారీ నుంచి అతి భారీ వర్షాలు**



అమరావతి,అక్టోబర్16ఆంధ్ర ప్రగతి :

బంగాళాఖాతంలో వాయుగుండం తీవ్రంగా మారి తీరంవైపు దూసుకొస్తోంది. ఇది నెల్లూరు-పుదుచ్చేరి మధ్య గురువారం తీరం దాటే అవకాశం ఉంది. దీని ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం 15 కి.మీ వేగంతో దూసుకొస్తోంది. దీని ప్రభావంతో ఇప్పటికే దక్షిణకోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. చెన్నైకి 280 కిలోమీటర్లు, పుదుచ్చేరికి 320 కిలోమీటర్లు.. నెల్లూరుకు 370 కిలోమీటర్ల దూరంలో వాయుగుండం కేంద్రీకృతమై ఉందని వాతావరణశాఖ తెలిపింది. పశ్చిమ వాయవ్య దిశగా 15 కిలోమీటర్ల వేగంతో కదులుతోందని ప్రకటించింది. దీని ప్రభావంతో దక్షిణకోస్తా, రాయలసీమలోని కొన్ని చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, వైఎస్ఆర్ జిల్లాల్లో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. సహాయక చర్యల కోసం జిల్లాల్లో 5 ఎస్డీఆఆర్ఎఫ్, 2 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అధికారులు సిద్ధంగా ఉంచారు. అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు **మిగతాది 2లో...**

# భారీ వర్షాలపై సీఎం సమీక్ష..

**అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచన**

**ఏపీలో కురుస్తున్న భారీ వర్షాలు**

**అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం**



2లో

## మోదీకి ఇచ్చిన హామీ సరే..

# సూపర్ సిక్స్ మాటేంటి?

**రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై షర్మిల మరోసారి విమర్శలు**

**‘ఎక్స్’ వేదికగా మంత్రి లోకేశ్‌పై కౌంటర్**

**హామీల విషయమై ప్రభుత్వాన్ని నిలదీత**

అమరావతి,అక్టోబర్16ఆంధ్ర ప్రగతి : ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై మరోసారి విమర్శలు గుప్పించారు. సూపర్ సిక్స్ హామీల విషయమై ప్రభుత్వాన్ని నిలదీశారు. 22 లోక్‌సభ సీట్లకు గాను 21 సీట్లు గెలిచి ప్రధాని మోదీకి ఇచ్చిన హామీని నెరవేర్చినందుకు గర్వంగా ఉందన్న మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యలకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా షర్మిల కౌంటర్ వేశారు. ప్రధాని మోదీ హామీ నెరవేర్చామన్న మీరు ఏపీ ప్రజలకు నెరవేర్చని హామీల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ఆమె ప్రశ్నించారు. ఫ్రాంక్లీ స్పీకింగ్ టీవీ షోలో మిమ్మల్ని చూడడం చాలా బాగుందని, కానీ ఇప్పుడు రాష్ట్ర ప్రజలకు మీరు ఇచ్చిన హామీలపై మీ ఉద్దేశం ఏంటో స్పష్టంగా చెప్పాలని అడిగారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 4 నెలలు గడుస్తున్నా.. ఇప్పటికీ మీ సూపర్ సిక్స్ హామీలు నెరవేరలేదని షర్మిల దుయ్యబట్టారు. ఇక సీఎం చంద్రబాబు ప్రతివారం దేశ రాజధాని ఢిల్లీకి పరుగులు పెడుతున్నప్పటికీ ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి ప్రధాని ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేరలేదని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు, విశాఖపట్నం స్టీల్



ప్లాంట్‌లకు దిక్కులేకుండా పోయిందన్నారు. వాటి పురోగతి పనులపై మంత్రి లోకేశ్ స్పష్టంగా మాట్లాడితే బాగుంటుందని షర్మిల అన్నారు.

**కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు**

# దీపావళి కానుక

**డీఏను 3 శాతం పెంచేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం**




2లో

# ఏపీ అధికారులు రిలీవ్...

**తెలంగాణ సీఎస్‌కు ముగ్గురు అధికారులు రిపోర్ట్**

**ఏపీ నుంచి రిలీవ్ అయిన సృజన, హరికిరణ్, శివశంకర్**

**తెలంగాణ నుంచి వాణీప్రసాద్, కరుణ, రోనాల్డ్ రాస్, ఆమ్రపాలి రిలీవ్**

**రాష్ట్రాల్లోనే కొనసాగించాలన్న అధికారుల విజ్ఞప్తి... కోర్టులో దక్కని ఊరట**



అమరావతి,అక్టోబర్16ఆంధ్ర ప్రగతి : ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన ఐఏఎస్‌లు సృజన, హరికిరణ్, శివశంకర్ తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి రిపోర్ట్ చేశారు.ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్ట్ చేయాలని డీవోపీటీ ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. వారికి క్యాట్, హైకోర్టులో తీర్పు అనుకూలంగా రాలేదు. దీంతో అధికారులు ఇరు రాష్ట్రాల నుంచి రిలీవ్ అయ్యారు.తెలంగాణ నుంచి ఏపీకి వెళ్లవలసిన వాణీప్రసాద్, వాకాటి కరుణ, రొనాల్డ్ రాస్, ఆమ్రపాలి కూడా తెలంగాణ నుంచి రిలీవ్ అయ్యారు. ఏపీ నుంచి సృజన, హరికిరణ్, శివశంకర్ రిలీవ్ అయ్యారు. వీరు ముగ్గురు తెలంగాణ సీఎస్‌కు రిపోర్ట్ చేశారు.

# సజ్జలకు నోటీసులు

**టీడీపీ కార్యాలయంపై దాడి కేసు...**

**వైసీపీ నేత సజ్జలకు మంగళగిరి పోలీసుల నోటీసులు**

**ఇప్పటికే పలువురు నేతల విచారణ**





2లో

**ఉగ్రవాదంపై పాకిస్థాన్‌కు జైశంకర్ చురకలు**



**ఇస్లామాబాద్‌లో జరుగుతున్న ఎస్‌సీఓ సదస్సు**

**భారత ప్రతినిధి బృందానికి మంత్రి జైశంకర్ సారథ్యం**

**ఈ సమావేశంలో ఉగ్రవాదంపై ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి**

# సజ్జలకు నోటీసులు

అమరావతి,అక్టోబర్16ఆంధ్ర ప్రగతి :
తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి కేసు వైసీపీ కీలక నేతల మెడ చుట్టూ బిగుసుకుంటోంది. ఈ కేసులో ఇప్పటికే పలువురు నేతలను విచారించిన పోలీసులు తాజాగా వైసీపీ నేత, ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి నోటీసులు జారీచేశారు. గురువారం ఉదయం 10:30 గంటలకు విచారణకు హాజరు కావాలని పేర్కొన్నారు.టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో సజ్జల ప్రమేయం కూడా ఉందని గుర్తించిన పోలీసులు ఆయన దేశం విడిచి పారిపోకుండా లుక్ అవుట్ నోటీసులు జారీచేశారు. దీంతో నిన్న ఆయనను ఢిల్లీ విమానాశ్రయం పోలీసులు అడ్డుకుని తిరిగి వెనక్కి పంపారు. ఈ నేపథ్యంలో ఈ కేసులో విచారణకు హాజరు కావాలంటూ తాజాగా ఆయనకు నోటీసులు జారీచేశారు. 2021 అక్టోబర్ 19న వైసీపీ శ్రేణులు టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడికి పాల్పడ్డాయి. ఈ కేసులో వైసీపీ నేతలు లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాశ్, తలశిల రఘురాంలను పోలీసులు ఇప్పటికే పలు దఫాలుగా పిలిచి, విచారించారు. కేసు కీలక దశలో ఉండడంతో దాడితో ప్రమేయం ఉన్న వైసీపీ ముఖ్య నేతలను విచారించేందుకు సిద్ధమవుతున్నారు. అందులో భాగంగానే సజ్జలకు నోటీసులు జారీ చేశారు.

## ఉగ్రవాదంపై పాకిస్థాన్‌కు జైశంకర్ చురకలు

షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సులో పాల్గొనేందుకు భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ పాకిస్థాన్ వెళ్లిన విషయం తెలిసిందే. ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అధ్యక్షతన ఇస్లామాబాద్‌లో జరుగుతున్న ఈ సదస్సులో భారత ప్రతినిధి బృందానికి జైశంకర్ సారథ్యం వహిస్తున్నారు. ఈ సమావేశంలో ఉగ్రవాదం, తీవ్రవాదంపై ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి... పరోక్షంగా పాక్‌కు చురకలు అంటించారు. సరిహద్దుల వెంబడి ఉగ్రవాదం, తీవ్రవాదం ఉంటే దేశాల మధ్య సహకారం వృద్ధి చెందే అవకాశం ఉండదని మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. అలాగే ఇరు దేశాల మధ్య సహకారానికి పరస్పర గౌరవం, సార్వభౌమ సమానత్వం ప్రాతిపదికగా ఉండాలని తెలిపారు.
అందుకు నమ్మకం చాలా ముఖ్యమని అన్నారు. అందరూ కలిసి ఐక్యంగా ముందుకు సాగితేనే ఎస్‌సీఓ సభ్య దేశాలకు ఎంతో మేలు జరుగుతుందని మంత్రి జైశంకర్ చెప్పారు.

## విజయనగరం జిల్లాలో డయేరియా మరణాలు చంద్రబాబు విచారం

అమరావతి:- విజయనగరం జిల్లా గుర్ల గ్రామంలో డయేరియాతో రెండు రోజుల్లో ఐదుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై తన కార్యాలయ అధికారులతో మాట్లాడి సీఎం వివరాలు తెలుసుకున్నారు.
నిన్న ఒక్కరోజే నలుగురు మృతి చెందారన్న సమాచారం నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితిపై సిఎం ఆరా తీశారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో బాధితుల పరిస్థితి, వారికి అందుతున్న చికిత్స, గ్రామంలో చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాలను అధికారుల ద్వారా సిఎం తెలుసుకున్నారు.
రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. నిన్నటి నుంచి నెల్లూరు సహా పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలపై అధికారులతో సమీక్షించారు. కొన్ని ప్రాంతాల్లో 20 సెంటీమీటర్లకు పైగా వర్షం పడడం, ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందన్న సమాచారం నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సిఎం ఆదేశించారు. వర్ష ప్రభావిత జిల్లాల్లోని పరిస్థితులను ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని సిఎంవో అధికారులకు సూచించారు.

### అన్నమయ్య జిల్లాలో ఆలయ ధ్వంసంపై చర్యలకు ఆదేశం

అన్నమయ్య జిల్లా కదిరినాథునికోటలోని అటవీప్రాంతంలో అభయాంజనేయస్వామి ఆలయంపై దాడిని ముఖ్యమంత్రి చంద్రబాబు ఖండించారు. దుండగుల దాడిలో అలయానికి నష్టం జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు దీపావళి కానుక

### డీఏను 3 శాతం పెంచేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం




న్యూఢిల్లీ అక్టోబర్16ఆంధ్ర ప్రగతి : మోడీ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక ప్రకటనలు చేశారు. ఒకవైపు కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు కానుకగా ఇస్తూనే మరోవైపు రైతులకు కూడా ప్రభుత్వం భారీ దీపావళి కానుకగా ఇచ్చింది. వాస్తవానికి రబీ సీజన్‌లో పంటల కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)ని కేంద్రం పెంచింది. ఇందులో గోధుమ పంటకు క్వింటాల్‌కు రూ.150, ఆవాల పంటపై క్వింటాల్‌కు రూ.300 చొప్పున పెంచారు.రైతులకు దీపావళి కానుకగా రావి పంటల ఎంఎస్‌పిని కూడా పెంచాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. నివేదిక ప్రకారం.. మార్కెటింగ్ సీజన్ 2025-26 కోసం ప్రభుత్వం రబీ పంటలకు కొత్త కనీస మద్దతు ధర (%మీఎస్‌పీ%)ని నిర్ణయించింది. ఇందులోభాగంగా గోధుమల ఎంఎస్‌పి క్వింటాల్‌కు రూ.150 పెంచి రూ.2,425కి చేరుకుంది. ఇది ఇప్పటివరకు క్వింటాల్‌కు రూ.2,275గా ఉంది. ఆవాలపై ఎంఎస్‌పీ క్వింటాల్‌కు రూ.300 పెంచి క్వింటాల్‌కు రూ.5,650 నుంచి రూ.5,950కి పెరిగింది. అదేవిధంగా, కందుల ఎంఎస్‌పిని క్వింటాల్‌కు రూ.210 పెంచాలని నిర్ణయించారు. దాని కొత్త ఎంఎస్‌పి క్వింటాల్‌కు రూ.5,650గా మారింది. ఇది గతంలో క్వింటాల్‌కు రూ.5440గా ఉంది. ఇది కాకుండా కందులుపై ఎంఎస్‌పి క్వింటాల్‌కు రూ.275 పెంచి క్వింటాల్‌కు రూ.6,425 నుంచి రూ.6,700కి పెంచారు. కుసుమ ధర రూ.5,800 నుంచి రూ.140 పెరిగి రూ.5,940కి చేరింది.రైతులకు వారి పంటలకు ప్రభుత్వం హామీ ఇచ్చే కనీస మద్దతు ధర ఎమ్ఎస్పీ అంటారు. ప్రభుత్వం రైతుల నుంచి పంటలను కొనుగోలు చేసే ధర ఇది. పంటల ధరల్లో హెచ్చుతగ్గుల వల్ల నష్టాల నుంచి రైతులను రక్షించడమే దీని లక్ష్యం. ఈ సందర్భంగా అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ .. రైతుల సంక్షేమం కోసం కేంద్రం కట్టుబడి ఉందన్నారు. పంజాబ్-హర్యానా సరిహద్దులో ఉన్న రైతుల గురించి కూడా ప్రస్తావించారు. రైతుల సంక్షేమానికి పూర్తి కట్టుబడి ఉన్నామని, రైతులకు మేలు చేసే అనేక నిర్ణయాలు తీసుకున్నామన్నారు

## భారీ వర్షాలపై సీఎం సమీక్ష..

అమరావతి,అక్టోబర్16ఆంధ్ర ప్రగతి :
రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు బుధవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. తిరుపతి, ప్రకాశం, చిత్తూరు, నెల్లూరు సహా పలు జిల్లాల ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు. కొన్ని ప్రాంతాల్లో 20 సెంటీమీటర్లకు పైగా వర్షం పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికారులు అలర్ట్‌గా ఉండాలని తెలిపారు. ఆకస్మిక వరదలకు అవకాశం ఉన్నందున యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. అలాగే వర్ష ప్రభావిత జిల్లాల్లోని పరిస్థితులను ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని సీఎంఓ అధికారులను ఆదేశించారు. ఇక భారీ వర్షాల కారణంగా జిల్లా కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్, జిల్లా స్థాయిలో అధికారులు కంట్రోల్‌రూంలు ఏర్పాటు చేశారు. వాకాడు, గూడూరు, తడ, సూళ్లూరుపేట, కోట, చిల్లకూరు, వెంకటగిరిలో భారీ వర్షం కురుస్తోంది. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రేణిగుంట విమానాశ్రయం రన్‌వేపైకి భారీగా నీరు చేరింది. దీంతో ల్యాండింగ్ సమస్య తలెత్తడంతో ఇండిగో ఫ్లైట్‌ను చెన్నైకి దారి మళ్లించారు.

## తీరం వైపు దూసుకొస్తున్న తీవ్ర వాయుగుండం

(మొదటి పేజి తరువాయి)
కొన్ని ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. గరిష్ఠంగా గంటకు 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, వైఎస్ఆర్ జిల్లాల్లో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. పెన్నా పరీవాహక ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. సహాయక చర్యల కోసం జిల్లాల్లో 5 ఎస్డీఆఆర్ఎఫ్, 2 ఎన్డీఆర్ఎఫ్ బఅందాలను అధికారులు సిద్ధంగా ఉంచారు. అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఒకేసారి ఆరు కొత్త పాలసీలు

(మొదటి పేజి తరువాయి)
ఆటోమొబైల్ హబ్ కావడానికి అవసరమైన అన్ని అంశాలు రాయలసీమలో ఉన్నాయి. సౌర, పవన శక్తిని కూడా ముందుకు తీసుకెళతాం. వీటన్నింటిని సమీకృతం చేస్తూ రాయలసీమను మరో స్థాయికి తీసుకెళతాం. అదే సమయంలో, ఉత్తరాంధ్ర అభివృద్ధికి కూడా కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. అందుకు తగిన ప్రణాళికలు మా వద్ద ఉన్నాయి. భోగాపురం ఎయిర్ పోర్టు, భావనపాడు పోర్టులను సకాలంలో పూర్తి చేస్తాం. ఇక్కడ 10 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ హబ్ ను అభివృద్ధి చేస్తాం. విశాఖను బెస్ట్ సిటీగా, నాలెడ్జ్ ఎకానమీకి కేరాఫ్ అడ్రస్ గా తీర్చిదిద్దుతాం. ఇకపై ఏపీలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' కాదు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ఉంటుంది. రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలు ఎన్ని ఎక్కువ ఉద్యోగాలు ఇస్తే అన్ని మంచి రాయితీలు అందిస్తాం. గ్లోబల్ బ్రాండ్స్ ను మరింత ముందుకు తీసుకెళతాం. ఫార్చ్యూన్ 500 కంపెనీలను రాష్ట్రానికి తీసుకువస్తాం. మా విజన్ స్వర్ణాంధ్ర-2047. పరిశ్రమలకు సంబంధించి ఉత్పాదక వ్యయం తగ్గించాలనేది మా లక్ష్యం. అదే సమయంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పెంచుతూ, అంతర్జాతీయస్థాయి తయారీ కేంద్రంగా ఏపీని తీర్చిదిద్దుతాం. ఒక్క తయారీ రంగంలోనే ఐదు లక్షల ఉద్యోగాలను సాధించడం మా టార్గెట్. ప్రతి నియోజకవర్గంలో ఒకటి కంటే ఎక్కువగా ఇండస్ట్రియల్ పార్కులు ఉండేలా చూస్తాం... మా ఇండస్ట్రియల్ పాలసీలో ముఖ్యమైన అంశం కూడా ఇదే. తూర్పు తీరంలో మన రాష్ట్రం మధ్యలో ఉంటుంది.. అదే మన బలం. దీన్ని సద్వినియోగం చేసుకుంటాం" అని చంద్రబాబు వివరించారు.

# తప్పుడు కేసులతో భయపడేది లేదు

## పైత్యంతో నాపై వార్తలు రాస్తున్నారు

## లుకౌట్ నోటీసులపై వైసీపీ నేత సజ్జల




అమరావతి,అక్టోబర్16ఆంధ్ర ప్రగతి :
లుకౌట్ నోటీసులపై వైసీపీ నేత సజ్జల రామకృష్ణా రెడ్డి స్పందించారు. విదేశాల నుంచి వస్తుంటే ఏపీ పోలీసులు లుక్ ఔట్ నోటీసులు ఇచ్చారని అసత్య ప్రచారం చేస్తున్నారు.. తప్పు చేసి నేను తప్పించుకునే ప్రయత్నం చేశారని పైత్యంతో వార్తలు రాస్తున్నారని సజ్జల ఆరోపించారు. కుటుంబంతో ఈ నెల 7న ఢిల్లీ నుంచి వెళ్ళాను.. తిరిగి 14న ఢిల్లీ ఎయిర్ పోర్ట్‌లో దిగి విజయవాడ వచ్చేందుకు సిద్ధం అవుతుండగా ఆపారని తెలిపారు. గుంటూరు ఎస్పీ నుంచి లోక్ వచ్చిందని చెప్పారు.. రీజన్ మాత్రం చెప్పలేదన్నారు. లుక్ ఔట్ నోటీసు అనేది వెళ్ళేటపుడు చేయాల్సి ఉంటుంది.. ఇక్కడ పోలీసులతో మాట్లాడాను.. హైకోర్టులో కేసు నడుస్తోందని ఈలోపు తొందరపాటు చర్యలు వద్దని ఆదేశాలు ఉన్నాయని చెప్పానని సజ్జల పేర్కొన్నారు. రూల్స్ పాటించాల్సి ఉన్నప్పటికీ వాటిని ఇక్కడ పాటించటం లేదు.. కోర్టు ద్వారా తాను ముందుకు వెళ్తానని సజ్జల రామకృష్ణా రెడ్డి తెలిపారు. 10-10-2024లో లుక్ ఔట్ నోటీసు ఇచ్చారు.. తాను ఏడో తేదీ వెళ్లిన తర్వాత నోటీసు సిద్ధం చేశారని పేర్కొన్నారు. చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్ మాదిరి పారిపోము.. చంద్రబాబు, అచ్చెన్నాయుడు, ధూళిపాళ్ల వంటి నేతలపై కేసులు పెట్టిన చర్యలు విచారణ చేశాం.. తప్పుడు కేసులు పెట్టినంత మాత్రాన భయపడేది లేదని సజ్జల తెలిపారు. ఏపీలో ప్రభుత్వం ఉందా..? అరాచకానికి హద్దు అనేది లేదా.. రెడ్ బుక్ కంటే వరస్ట్?గా నడుస్తోందని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వ హయాంలో చంద్రబాబును జగన్ కక్ష పూరితంగా అరెస్టు చేయలేదు.. సిట్ నివేదిక ఆధారంగా మాత్రమే అరెస్టు జరిగింది అనేది ఈడీ చర్యలతో స్పష్టం అయిందని సజ్జల తెలిపారు. జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబును కక్ష పూరితంగా అరెస్టు చేయలేదు.. విచారణ జరిపి చేశారన్నారు. ముంబై నటి కేసులో కూడా స్టేట్‌మెంట్ రికార్డు కావాలని రికార్డు చేసి అరెస్టులు కేసులు పెడుతున్నారని సజ్జల తెలిపారు. మరోవైపు.. టీడీపీ ఆఫీసు కేసులో కూడా ఇలానే తన పేరు నమోదు చేశారన్నారు. టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో కూడా కావాలని ప్లానింగ్ ప్రకారం రెచ్చగొట్టి చేసినట్టు అనిపిస్తుంది.. ఒకవైపు అరెస్టులు చేస్తుంటే మరోవైపు సీఐడీకి కేసు అప్పగించారని పేర్కొన్నారు. కార్యకర్తల మొదలు జగన్ సహా తప్పుడు కేసులు పెట్టడం జరుగుతోంది.. ఎన్నికల హామీలు వదిలేసి మేం ఏం చేయమనే నిర్ణయానికి చంద్రబాబు వచ్చినట్టు అనిపిస్తోందని ఆరోపించారు. వేధింపులు మాత్రం తీవ్ర స్థాయికి తీసుకువెళ్తున్నారని సజ్జల రామకృష్ణా రెడ్డి వ్యాఖ్యానించారు.

# ఉచిత ఇసుక లక్ష్యం దెబ్బతినరాదు

## ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రావద్దు

## సామాన్యులకు భారం కాకుండా చూడాలి

## మంత్రులకు సిఎం చంద్రబాబు వార్నింగ్



అమరావతి,అక్టోబర్16ఆంధ్ర ప్రగతి :
ఆంధ్రప్రదేశ్‌లో ఉచిత ఇసుక విధానం లక్ష్యం నెరవేరాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులకు స్పష్టంచేశారు. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టినా ఇసుక పొందడంలో ఇబ్బందులు పడటంతో పాటు ఎక్కువ మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో మంత్రమండలి సమావేశంలో చంద్రబాబు ఇసుక విషయంలో సీరియస్ అయినట్లు తెలుస్తోంది. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఇసుకను అందుబాటులో ఉంచడంతో పాటు ఇంటి నిర్మాణంలో ఇసుక కొనుగోలు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెడితే కొందరు దళారులు సామాన్య ప్రజలకు ఇసుకను భారంగా మార్చడంపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఉచిత ఇసుక విధానంలో నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోనని, వెంటనే మార్పు రావాలని చంద్రబాబు ఆదేశించారు. ఉచిత ఇసుక విధానంలో నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోనని, వెంటనే మార్పు రావాలని చంద్రబాబు ఆదేశించారు. పది రోజుల్లో మార్పు కనిపిం చాలని, నిజమైన లబ్దిదారుడికి ఉచిత ఇసుక పథకంతో ప్రయోజనం కలగాలని సీఎం పేర్కొన్నారు. ఇసుక రాష్ట్రం లో విరివిగా దొరకాలని, అన్ని అడ్డంకులు తొలగించి సామాన్య ప్రజలకు ఉచిత ఇసుక అందించి తీరాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉచిత ఇసుక విధానాన్ని ప్రతిష్టంగా అమలు చేయాలని సీఎం చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనిలో భాగంగా ఇసుక రీచ్‌ల నిర్వహణను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలనే ప్రతిపాదనకు ప్రభుత్వం ఇటీవల ఆమోదం తెలిపింది. ఉచిత రీచ్‌లకు అదనంగా ప్రైవేటు రీచ్‌లనూ ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. పేరు ఏదైనా... ప్రజలకు అవసరమైన ఇసుక, వారికి ఆమోదయోగ్యమైన ధరతో అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంది. అక్టోబర్ 11వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద ఇసుకపై సమీక్షించారు. ఈ సందర్భంగా గనుల శాఖ అధికారులు పలు ప్రతిపాదనలను సీఎం ముందుంచిన విషయం తెలిసిందే. రీచ్‌లను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడం వల్ల ఇసుక స్టాక్ పాయింట్ల పరిశీలన, నిరంతర, సరఫరా పర్యవేక్షణ సులభతరం అవుతుందని అధికారులు కోరగా.. ఇసుక సరఫరా ధరను జిల్లా ఇసుక కమిటీలే నిర్ణయించేలా చర్యలు తీసుకోవాలని, అక్రమాలకు తావులేకుండా చూసుకోవాలని సీఎం సూచించారు. నిరంతర నిఘా, పర్యవేక్ష ణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఇసుక రీచ్‌ల నిర్వహణకు జిల్లాల వారీగా టెండర్ల ద్వారా ప్రైవేటు ఏజెన్సీలను ఎంపిక చేయనున్నట్లు తెలిసింది. ఇసుక లభ్యతను పెంచేందుకు ప్రైవేటు రీచ్‌లను ప్రారంభించాలని గనుల శాఖ ప్రతిపాదించింది. దీని ప్రకారం ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు, ఏజెన్సీలు గనుల శాఖ నుంచి అనుమతి తీసుకొని సొంతంగా రీచ్‌లను ప్రారంభించి ఇసుక తవ్వకాలు చేపడతారు. ఉచిత ఇసుక పాలసీలో భాగంగా ప్రస్తుతం ఇసుక రీచ్‌లు గనుల శాఖ నియంత్రణలో ఉన్నాయి. వర్షాకాలం కావడంతో రీచ్‌ల్లో తవ్వకాలు చేపట్టడం లేదు. త్వరలో తవ్వకాలు ప్రారంభించినప్పటికీ డిమాండ్‌కు సరిపడేంతగా ఇసుక అందుబాటులోకి రాదనే ఉద్దేశంతో ప్రైవేటు రీచ్‌ల ప్రతిపాదన తెస్తున్నట్లు గనుల శాఖ అధికారులు వివరించారు.

**ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యం**

వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. థింక్ గ్లోబల్లీ, యాక్ట్ గ్లోబల్లీ నినాదంతో ముందుకెళున్నామన్నారు. ఏపీ కేబినెట్ సమావేశం ముగిసిన తర్వాత సీఎం మీడియాతో మాట్లాడారు. ఒకేసారి ఆరు కొత్త పాలసీలు తీసుకొచ్చాం. ఎలక్ట్రానిక్స్, ఇండస్ట్రియల్, క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీ పాలసీలు తీసుకొచ్చాం. పర్యాటక, ఐటీ, వర్చువల్ వర్కింగ్ పాలసీలు తీసుకువస్తాం. 'వన్ ఫ్యామిలీ- వన్ ఎంటర్ ప్రెన్యూర్ నినాదంతో వెళ్తున్నాం. ఉద్యోగం చేయడం కాదు.. ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి. కొత్త పాలసీలు రాష్ట్ర ప్రగతిని మారుస్తాయి. యువత భవిష్యత్తులో పెనుమార్పులు తెస్తాయని సీఎం వివరించారు. అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తాం. ఐదు జోన్లలో (విశాఖ, రాజమహేంద్రవరం, తిరుపతి, విజయవాడ లేదా గుంటూరు, అనంతపురం) ఐదు ఇన్నోవేషన్ రతన్ టాటా హబ్‌లు వస్తాయి. ఆధునిక టెక్నాలజీని ప్రజలకు మరింత చేరువ చేస్తాం. కొత్త పాలసీలతో ఏపీలో పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయి. నాలెడ్జ్ ఎకానమీకి ఏపీ ఇన్నోవేషన్ హబ్‌గా మారాలి. కృష్ణా జలాలు రాయలసీమకు ఇవ్వొచ్చని చెప్పింది ఎన్టీఆర్. అది చేసి చూపించింది తెలుగుదేశం పార్టీ. నదుల అనుసంధానంతోనే ఏపీ అభివృద్ధి. దెబ్బతిన్న ఏపీ బ్రాండ్‌ను పునర్ నిర్మించాల్సి ఉంది. భారీగా విదేశీ పెట్టుబడులు తీసుకురావాల్సి ఉంది. ఆదాయం పెంచి ప్రజలకు పంచాలన్నదే మా నినాదం. ఆక్వా కల్చర్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్ తయారవుతుంది. ఫుడ్ ప్రాసెసింగ్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాం. ఫుడ్ హార్టికల్చర్ హబ్‌గా రాయలసీమ మారుతుంది. దేశంలో తొలిసారిగా పరిశ్రమల డీకార్బనైజేషన్‌ను ప్రోత్సహిస్తాం' అని సీఎం చంద్రబాబు తెలిపారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
గురువారం17 అక్టోబర్ 2024

# ప్రమోషన్, బదిలీ పై వెళ్తున్న అధికారులకు వీడ్కోలు

### -జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా.




ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 16: నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాల్ నందు ప్రమోషన్ పై ఏవో గా అనంతపురం జిల్లా 14 బెటాలియన్ కు బదిలీపై వెళ్తున్న నిజాముద్దీన్ కు , ఆర్ ఐ గా ప్రమోషన్ పై ఆక్టోపస్ కు వెళ్తున్న బి.రామ్మోహన్ కు , బదిలీపై వెళ్తున్న రైల్వే ఎస్సై వీరన్న కు ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించిన నంద్యాల జిల్లా పోలీసు అధికారులు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నిజాముద్దీన్ నంద్యాల జిల్లా నందు సుమారు ఒక సంవత్సరం పది నెలలు పాటు జిల్లా పోలీస్ శాఖకు సేవలందించి తన సొంత జిల్లాకు బదిలీపై వెళ్లడం సంతోషంగా ఉందని, నంద్యాల జిల్లా జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఏ ఏ ఓ గా పోలీస్ శాఖకు విశిష్టమైన సేవలు అందించడం జరిగిందని మిగిలిన ఉద్యోగ జీవితంలో దేవుడు ఆయురారోగ్యాలు ప్రసాదించి సుఖ సంతోషాలతో జీవించాలని మరియు ప్రమోషన్ పై రిజర్వ్ ఇన్స్పెక్టర్ గా ఆక్టోపస్ కు బదిలీపై వెళ్తున్న బి . రామ్మోహన్ ,బదిలీపై వెళు న్న రైల్వే ఎస్సై బి .వీరన్న వారి ఉద్యోగ జీవితంలో ప్రజలకు మంచి సేవలు అందించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఉద్యోగ జీవితంలో మరింత ముందుకు సాగాలని దేవుని కోరుకుంటున్నానని తెలియజేశారు. ఈ సమావేశం నందు బదిలీపై వెళ్తున్న ఏ ఏ ఓ నిజాముద్దీన్ ని, ఆర్ ఐ రామ్మోహన్ ఆర్ఎస్ఐ వీరన్న ని జిల్లా ఎస్పీ శాలువా పూలమాలతో సత్కరించడం జరిగింది. అనంతరం పోలీసు అధికారులు జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పూలమాలలు,శాలువాలతో సత్కరించి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పి తో పాటుగా ఆర్మడు రిజర్వు డిఎస్పి శ్రీనివాసులు, ఆర్ ఐ మంజునాథ్, ఖాదర్ వలీ, కవిత , సురేష్ మరియు కార్యాలయ డి.ఎస్.పి సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### రాష్ట్ర న్యాయ , మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.




నంద్యాల జిల్లా అక్టోబర్ 16: నంద్యాల జిల్లాలో ఈనెల 16,17 తేదీల్లో భారీ వర్షాలు పడుతున్న సందర్భంగా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ.. పోలీస్ వ్యవస్థ, విపత్తు నిర్వహణ శాఖ అధికారులు 24ఐ7 అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం, జరగకుండా నియంత్రణ చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని అతి భారీ వర్షాలు పడే ప్రాంతాలలో ప్రజలకు ముందస్తుగా సమాచారం ఇచ్చి వారిని అప్రమత్తం చేయాలన్నారు. ప్రజల మొబైల్ ఫోన్ లకు భారీ వర్షాలపై మెసేజ్ లు పంపి అలర్ట్ చేయాలన్నారు. వర్షాల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. వరద ప్రవాహాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. వర్షాల వల్ల వాగులు, వంకలు పొంగే అవకాశం ఉన్నందున అధికారులంతా అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి అధికారి కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టేలా సిద్ధంగా ఉండాలని మంత్రి ఫరూక్ తెలిపారు.

# ప్రధమా, ద్వితీయా బహుమతులు సాధించిన బాల అకాడమీ విద్యార్థినులు.





ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ అక్టోబర్ 16: నంద్యాల పట్టణంలోని పిఎన్ఆర్ కాలేజీ యందు బుధవారం భారత్ - కొ - జనో వారి అధ్వర్యంలో జరిగిన సీనియర్ క్విజ్ పోటిలలో బాల అకాడమీ పాఠశాల విద్యార్థినులు అయిన యస్. బుషీర, యస్. సమీర. లు మొదటి స్థానంలో నిలిచి, విజయం సాధించారు. అలాగుననే పాటలు విభాగం పోటిలలో బాల అకాడమీ పాఠశాల విద్యార్థినులు రక్షితనందిని, రిషితరెడ్డి, శ్రీవాణి, ప్రియాంక, భవ్యశ్రీ మరియు హర్షితబాయి లు ద్వితీయా స్థానంలో నిలిచి, విజయం సాధించారు. పాఠశాల కరస్పాండెంట్ ఎం.జి.వి.రవీంద్రనాథ్ మరియు ప్రిన్సిపల్ శ్రీమతి మాధవీలత తమ విద్యార్థినులకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు.

# తెలుగు గంగ కాలువలో మరో యువకుడు గల్లంతు.



ఆంధ్ర ప్రగతి మహానంది అక్టోబర్ 16:మహానందిలోని అయ్యన్నగర్ తెలుగు గంగ కాలువలో ప్రమాదవశాత్తు యువకుడు గల్లంతైన ఘటన బుధవారం జరిగింది. మహానంది గ్రామం ఈశ్వర్ నగర్ కి చెందిన గౌతమ్ అనే యువకుడు మేకలను మేపేందుకు వెళ్లే క్రమంలో కాలుజారి, కాలువలో ప్రమాదవశాత్తు పడి నీటి ప్రవాహానికి కొట్టుకొని పోయినట్టుగా స్థానికులు తెలిపారు. ఆ యువకుడు కోసం గాలింపులు చర్యలు చేపట్టారు. ఈ విషయంపై మహానంది పోలీసులకు సమాచారం అందించారు.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# నంద్యాల జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకురండి

### -ఏటా 15% గ్రోత్ రేటుతో ప్రణాళికలు రూపొందించండి.
### -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.



ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 16: స్వర్ణాంధ్రఏ2047 లో భాగంగా నంద్యాల జిల్లాను రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలన్న నిర్దిష్ట లక్ష్యంతో అధికారులు పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో స్థూల దేశీయోత్పత్తి, ఆదాయ వృద్ధిరేట్లపై జిల్లా అధికారులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రతి ఏడాది 15% గ్రోత్ రేట్ లక్ష్యంతో పనిచేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని శాఖలు తమ వృద్ధిరేటును ప్రతి ఏటా 15 శాతం పెంచుకుంటూ నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించాలన్నారు. రాష్ట్రంలోనే నంద్యాల జిల్లాకు ఒక ప్రత్యేక గుర్తింపు స్థానం తీసుకొచ్చేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వృద్ధిరేటు సాధించేందుకు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలు, పారిశ్రామిక రంగాలతో పాటు విద్య, వైద్యం, ఇరిగేషన్ తదితర అన్ని రంగాలలో అభివృద్ధి నివేదికలు తయారు చేసే విధానంపై నిపుణులైన మాస్టర్లచే శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిక్షణా కారక్రమం అన్ని శాఖలకు సంబంధించి ఆదాయ, వృద్ధిరేట్లను గణించి ఖచ్చితమైన సమాచారాన్ని ప్రభుత్వానికి చేరవేయడంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. తద్వారా గ్రామ, మండల, జిల్లా స్థాయి ప్రణాళికలు రూపొందించి అభివృద్ధి రేటును పెంచుకుంటూ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలన్నారు. గ్రామాలకు సురక్షిత మంచి నీటిని సరఫరా చేస్తే ప్రజలు ఆరోగ్యవంతులై తద్వారా జిడిపి పెరుగుదల, తద్వారా ప్రభుత్వాస్పత్రుల్లో రోగుల సంఖ్య తగ్గితే జిడిపి పెరుగుతుందని కలెక్టర్ ఉదహరించారు. అంతకుముందు స్థూల దేశీయోత్పత్తి, ఆదాయ వృద్ధిరేట్లపై నంద్యాల మోడల్ స్కూల్ లెక్చరర్ మల్లికార్జునప్ప, బేతెంచెర్ల మోడల్ స్కూల్ లెక్చరర్ మరియాదాసులు స్పష్టమైన రీతిలో జిల్లాధికారులకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా ఉన్నతస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# విద్యాలయాలు- దేవాలయాల్లో ఉన్న ప్రాంతాల్లో మద్యం షాపులకు అనుమతులు ఇవ్వరాదు

### విద్యాలయాలు దేవాలయాల చుట్టుపక్కల మద్యం షాపులు ఏర్పాటు చేస్తే ప్రత్యక్ష ఉద్యమాలకు సిద్ధమవుతాం

### ప్రభుత్వ అధికారులను హెచ్చరించిన ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శులు ధనుంజయ్, నాగరాముడు




ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ అక్టోబర్ 16: నిత్యం విద్యార్థులతో రద్దీగా ఉండే పద్మావతి నగర్ ఏరియాలో, మరియు నంద్యాల పట్టణంలో ఏ ఒక్క మద్యం షాప్ కు అనుమతి ఇవ్వకుండా ఏర్పాటు చేయకుండా అధికారులు చూసుకోవాలి.

ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శులు ధనుంజయ, నాగరాముడు మాట్లాడుతూ కూటం ప్రభుత్వం నూతనంగా టెండర్లకు పిలిచి ఏర్పాటు చేయబోతున్నటువంటి మద్యం షాపులను విద్యాలయాలు దేవాలయాలు నిత్యం విద్యార్థులతో రద్దీగా ఉండే ప్రాంతాలలో అనుమతులు ఇవ్వకుండా ఏర్పాటు చేయకుండా చూసుకోవాలని వారు కోరారు. నిత్యం విద్యార్థులతో రద్దీగా ఉండేటువంటి పద్మావతి నగర్ ఏరియాలో ఏ ఒక్క వైన్ షాప్ కు అనుమతి ఇవ్వకుండా ఏర్పాటు చేయకుండా చూసుకోవాలని వారు అధికారులకు విజ్ఞప్తి చేశారు. గతంలో కూడా ఒక లిక్కర్ మాటు ఒక వైన్ షాప్ ను ఏర్పాటు చేసి ప్రభుత్వమే నడిపినటువంటి మద్యం షాపులను మరలా తిరిగి కూటమి ప్రాంతంలో టెండర్లు దక్కించుకున్నటువంటి షాపు యజమానులు ఆ ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకోవడానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో అక్కడ మద్యం షాపులో ఏర్పాటు చేయకుండా అనుమతులు ఇవ్వకుండా ఉండాలని అధికారులను డిమాండ్ చేశారు. ఒకవేళ పద్మావతి నగర్ ఏరియాలో మద్యం షాపుల ఏర్పాటుకు ప్రభుత్వ అధికారులు అనుమతిస్తే ఆ ఏరియా లో ఉన్నటువంటి విద్యార్థులను యువజనలను కలుపుకొని పెద్ద ఎత్తున మద్యం షాపులను ముట్టడించడానికి సిద్ధమవుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు సురేష్, విష్ణు, ఎర్రిస్వామి,రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య రంగ పురోగతిలో అనస్థీషియా వైద్యులు కీలకం.

### -డాక్టర్ రవి కృష్ణ. -ప్రపంచ అనస్థీషియా దినోత్సవం సందర్భంగా ప్రజా అవగాహన కరపత్రాల విడుదల.





ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ అక్టోబర్ 16: అక్టోబర్ 16 ప్రపంచ అనస్థీషియా దినోత్సవం సందర్భంగా భారత జాతీయ అనస్థీషియా వైద్యుల సంఘం నంద్యాల నగర శాఖ ఆధ్వర్యంలో అనస్థీషియా వైద్యుల సంఘం కార్యాలయంలో శస్త్ర చికిత్సలలో, అత్యవసర చికిత్స వార్డులలో అనస్థీషియా వైద్యుల పాత్ర గురించి అవగాహన కరపత్రాలు విడుదల చేశారు.

ఈ సందర్భంగా జాతీయ అనస్థీషియా వైద్యుల సంఘం నంద్యాల శాఖ అధ్యక్షులు మరియు ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, అనస్థీషియా వైద్యుల సంఘం రాష్ట్ర శాఖ కార్యవర్గ సభ్యులు డాక్టర్ మధుసూదన రెడ్డి, నంద్యాల శాఖ కార్యదర్శి డాక్టర్ నాగరాజా రెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ శేష ఫణి, కోశాధికారి డాక్టర్ మహబూబ్ బాషా, సంయుక్త కార్యదర్శి డాక్టర్ నాగరాజు పాల్గొని ప్రసంగించారు.

1846లో అక్టోబర్ 16వ తేదీన అమెరికాలోని మాసాచుసెట్స్ నగరంలో మార్టన్ మహాశయుడు ఈథర్ ఉపయోగించి దంత శస్త్ర చికిత్సను నొప్పి తెలియకుండ చేసిన రోజును ప్రపంచ అనస్తీషియా దినోత్సవం గా నిర్వహిస్తున్నారని తెలిపారు. అనస్థీషియా రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు శస్త్ర చికిత్స ల పరిధిని విస్తృతం కావడానికి, వినూత్న శస్త్ర చికిత్సల ప్రక్రియలకు నాంది పలికింది అన్నారు. క్లిష్టమైన శస్త్ర చికిత్సలు మెదడు, గుండె, లివర్, కిడ్నీలకు చేయడానికీ అనస్థీషియా రంగంలో వచ్చిన నూతన పరికరాలు,రోగి స్థితి గతులను నిరంతరం గమనించే పరికరాలు ఎంతో ఉపయోగకరంగా వున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అనస్థీషియా వైద్యులు మల్లీశ్వరి,మాధవి, రేచెల్, ప్రియదర్శిని, నియాజ్ పాల్గొన్నారు.

# గుండెపోటుతో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుడు మృతి

### - సంతాపం వ్యక్తం చేసిన మున్సిపల్ చైర్మన్ కమిషనర్.



ఆంధ్ర ప్రగతి డోన్ అక్టోబర్ 16: గుండెపోటుతో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుడు జోసెఫ్ (52) మృతి చెందాడు.ఆయన మృతికి మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ,కమిషనర్ ప్రసాద్ గౌడ్ ,సిఐటియు పట్టణ కార్యదర్శి టి.శివరాం సంతాపం వ్యక్తం చేశారు.స్థానిక కొండపేట లోని మృతిని స్వగృహం నందు ఆయన భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించారు.అనంతరం సిఐటియు పట్టణ కార్యదర్శి టి.శివరాం మాట్లాడుతూ మృతుడు మున్సిపాలిటీ నందు పర్మినెంట్ కార్మికునిగా పనిచేస్తున్నాడని అన్నారు. బుధవారం తెల్లవారు జామున విధులలో భాగంగా అటెండెన్స్ వేయించుకోవడానికి పాత మున్సిపల్ కార్యాలయం దగ్గరకు వెళ్లే క్రమంలో రైల్వే లైన్ ప్రాంతంలో అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి అక్కడికక్కడే మరణించినట్లు ఆయన తెలిపారు.మృతునికి భార్య జ్యోతి,వివాహము అయిన ముగ్గురు కుమార్తెలు ఉన్నట్లు ఆయనతెలిపారు.మున్సిపాలిటీ నుండి మట్టి ఖర్చులకు గాను చైర్మన్ రాజేష్ రూ.15,000 వేల రూపాయలు అందజేయడం జరిగిందని,మృతుని కుటుంబానికి మున్సిపాలిటీ నుండి రావాల్సిన బెనిఫిట్స్ త్వరితగతిన రావడానికి చర్యలు తీసుకుంటామని కుటుంబ సభ్యులలో ఒకరిని ఉద్యోగంలోకి తీసుకొని వారి కుటుంబానికి అండగా ఉంటామని చైర్మన్ కమిషనర్ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.శానిటరీ ఇన్స్పెక్టర్ సునీల్,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పెద్ద ఎల్లయ్య, కుల్లాయప్ప,నాయకులు గోవిందు,ఏసు,హైమారావు, ఆవులయ్య,మేస్త్రీలు లక్ష్మిరెడ్డి,దేవదానం,అశోక్, రామాంజి,కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని నివాళు లు అర్పించారు.

# ట్రాన్స్ జెండర్స్ కు సమాన అవకాశాలు కల్పిస్తాం.!

## -ట్రాన్స్ జెండర్ సమస్యలను పరిష్కరిస్తాం. -ట్రాన్స్ జెండర్స్ కు కలెక్టర్ భరోసా.

ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 16: సమాజంలో పురుషులు, స్త్రీలతో పాటు ట్రాన్స్ జెండర్లకు కూడా సమాన అవకాశాలు కల్పిస్తామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్లోని సెంటనరీ హాలులో ట్రాన్స్ జెండర్ ల అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ట్రాన్స్జెండర్లు మెరుగైన జీవితాన్ని అవలంబించేందుకు పురుషులు, స్త్రీలతో సమాన అవకాశాలు కల్పిస్తూ ఉపాధి మార్గాలు చూపిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో 240 మంది పెన్షన్ పొందుతున్నట్లు, వైద్య శాఖ నివేదికల్లో 690 మంది ఉన్నట్లు, ఎన్జీవో సంస్థలు వెయ్యి మంది ఉన్నట్లు రకరకాల గణాంకాలు చెప్తున్నారని... నిజమైన ట్రాన్స్జెండర్ల జాబితాను సమర్పించాలని సంబంధిత ఎన్జీవో సంస్థలను కలెక్టర్ సూచించారు. ట్రాన్స్ జెండర్లు ఏ ఏరియాలో ఉన్నారు, ఎంతమందికి రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఓటర్ కార్డులు ఉన్నాయి, ప్రస్తుతం వారు చేస్తున్న పనులు, వారితోపాటు జీవిస్తున్న వ్యక్తులు తదితర వివరాలను వారం రోజుల్లో ఇవ్వాలని సంబంధిత అధికారులు, ఎన్జీవో సంస్థలను కలెక్టర్ ఆదేశించారు. భారత ప్రభుత్వం జారీచేసిన ట్రాన్స్ జెండర్ పర్సన్స్






ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్ చట్టాన్ని 2019లో జారీ చేసిన చట్టం మేరకు భిక్షాటన, అసభ్య ప్రవర్తన, వ్యభిచారం మూడు అంశాలను పరిగణలోనికి తీసుకొని ప్రభుత్వం తరఫున లబ్ధి చేకూర్చేందుకు అవకాశం ఉంటుందన్నారు.

సమాజంలో ట్రాన్స్ జెండర్లను వేరు చేసి మనోభావాలు దెబ్బతీయడం ఉద్దేశం కాదని మీ అభ్యున్నతికి వికలాంగుల శాఖ పనిచేస్తుందని కలెక్టర్ వివరించారు. గతంలో తాను పనిచేసిన జిల్లాలలో ట్రాన్స్ జెండర్ ల సమస్యలు తన దృష్టికి వస్తే సంబంధిత అధికారులతో వాళ్ళు నివసిస్తున్న కాలనీలకు వెళ్లి లబ్ధి చేకూర్చామన్నారు. ఇదే తరహాలో జీఓలోని నిబంధనల మేరకు ట్రాన్స్ జెండర్లకు మెరుగైన జీవితాన్ని అవలంబించేందుకు ప్రభుత్వం తరఫున భరోసా కల్పిస్తామన్నారు. జిల్లాలో 42 మంది హెచ్ఐవి పేషెంట్లు ఉన్నారని ట్రాన్స్ జెండర్లు కూడా తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. అందరికీ రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, ఓటర్ కార్డులు మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. పెన్షన్ పొందుతున్న 240 మంది ట్రాన్స్ ట్రాంజెండర్లను 24 స్వయం సంఘాలుగా 15 రోజులలో ఏర్పాటు చేసి విధివిధానాలపై అవగాహన కల్పించాలని డిఆర్డిఏ పిడి, మెప్మా పీడీలను కలెక్టర్ ఆదేశించారు. ఆసక్తి గల వృత్తులపై నైపుణ్యాన్ని ఇచ్చి బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యాలు కూడా కల్పిస్తామని కలెక్టర్ వివరించారు. జిల్లాలో నూతనంగా మెడికల్ కళాశాల వచ్చిందని, ప్రభుత్వ సర్వజన వైద్యశాల అప్గ్రేడ్ అయిన నేపథ్యంలో మెడికల్ బోర్డు ఏర్పాటుకు మూడు రోజుల్లో ఫైల్ ను సర్కులేట్ చేయాలని డిఎంఅండ్హెచ్ఓ, జిజిహెచ్ సూపరింటెండెంట్ కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రిలో ప్రత్యేక ఓపి బ్లాక్ ను కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

జిల్లాలో హౌసింగ్ స్కీం కింద కేటాయించిన 70 మంది ఐడి వివరాలను తీసుకొని విచారిస్తామన్నారు. అలాగే నూతన పాలసీ ప్రకారం జిల్లాలోని ట్రాన్స్ జెండర్ ల అందరికీ గృహాలు కేటాయిస్తామన్నారు. ఒక్కో ఒక్కో ఇంటి నిర్మాణానికి మూడున్నర నుండి నాలుగు లక్షల రూపాయల వరకు ప్రభుత్వం భరిస్తుందన్నారు. ట్రాన్స్ జెండర్ లందరూ ఐక్యమత్యంగా ఉండి మీ హక్కులను మీరు సాధించుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి మూడు నెలలకు ఓసారి సమావేశం నిర్వహించి ట్రాన్స్ జెండర్ల సమస్యలకు పరిష్కారం చూపిస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి రైస్ ఫాతిమా, డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, అడిషనల్ డిఎంహెచ్వో శారదాబాయి, సివిల్ సప్లైస్ అధికారి వెంకట్రాముడు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్ర కుమార్, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ సబిహా పర్వీన్, ఎంప్లాయిమెంట్ అధికారి సోమ శివారెడ్డి, హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, స్కిల్ డెవలప్మెంట్ అధికారి శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

## సిఐటియు పట్టణ కార్యదర్శి టి.శివరాం,మండల అధ్యక్షులు పి.రామాంజనేయులు డిమాండ్

ఆంధ్ర ప్రగతి డోన్ అక్టోబర్ 16: మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి టి.శివరాం,మండల అధ్యక్షులు పి.రామాంజనేయులు డిమాండ్ చేశారు.ఈ మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు గత ప్రభుత్వ హయాంలో కార్మికులు చేసిన 16 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలలో భాగంగా అర్హత కలిగిన వాహన డ్రైవర్లకు వారి నైపుణ్యానికి అనుగుణంగా రూ.24,500 రూపాయల వేతనం ఇవ్వాలని,సంక్రాంతి కానుక రూ.1000 రూపాయలు ఇవ్వాలని,మరణించిన కార్మికుల కుటుంబాలకు 2 లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా వెంటనే చెల్లించాలని,మరణించిన మరియు రిటైర్మెంట్ అయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇచ్చినట్లే ఇచ్చి




దాదాపు సంవత్సర కాలం పాటు వారు పని చేసిన తర్వాత ఆప్కాస్ లో పేర్లు నమోదు కాలేదు అన్న సాకుతో అర్ధాంతరంగా తొలగించిన కార్మికులను వెంటనే విధులలోకి తీసుకొని వారి కుటుంబాలకు న్యాయం చేయాలని,పిఎఫ్,ఈఎస్ఐ లలో ఉన్న సమస్యలను పరిష్కరించి పకడ్బందీగా అమలు చేయాలని,పర్మినెంట్ కార్మికులకు 3 సంవత్సరాలుగా పెండింగ్ ఉన్న బట్టలు,సబ్బులు,నూనెలు,రక్షణ పరికరాలు వెంటనే ఇవ్వాలని,సకాలంలో వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ %డ% ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్ష,కార్యదర్శులు పెద్దఎల్లయ్య,కుల్లాయప్ప,డ్రైవర్లు రామాంజి, శ్రీరాములు,అన్వర్,మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులు బాలు,మంగమ్మ, రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాలలో అక్టోబర్ 19, 20 తేదీలలో జరిగే ట్రాన్స్పోర్ట్ రాష్ట్ర వర్క్ షాప్ జయప్రదంచేయండి

ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా అక్టోబర్ 16: డ్రైవర్ల జీవితాలతో చెలగాటం ఆడే భారత న్యాయ సంహిత చట్టం సెక్షన్ (1)(2) లను రద్దు చేయాలని, డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ అక్టోబర్ 19, 20 (శని, ఆది) తేదీలలో నంద్యాల జిల్లాలో రెండు రోజులపాటు జరిగే ట్రాన్స్పోర్ట్ రాష్ట్ర వర్క్ షాప్ జయప్రదం చేయాలని కోరుతూ అన్ని ఆటో స్టాండ్ దగ్గర ప్రచారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆటో, ట్రాలీ 4వీలర్స్ డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఆటో స్టాండ్ యూనియన్ నాయకులు ప్రశాంత్, ఆంజనేయులు, సునీల్, నందు, యేసు, పాల్గొనడం జరిగింది. ఆటో అండ్ ట్రాలీ, ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత పది సంవత్సరాల కాలంలో డ్రైవర్ల సంక్షేమం కోసం కృషి చేసిన దాఖలాలు లేవని, డ్రైవర్ల సంక్షేమానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆలోచన చేయడం లేదని, కేరళ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ బోర్డును ప్రతి రాష్ట్రం అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా ఇటీవల జూలై 1 నుండి ప్రవేశపెట్టిన భారత న్యాయ సంహిత చట్టం 106(1)(2) లను వెంటనే రద్దు చేయాలి. ఎందుకంటే డ్రైవర్లు స్టీరింగ్ పట్టుకుంటే జైల్లోకి వెళ్లాల్సిందే అనేవిధంగా చట్టం చేయటం చాలా దుర్మార్గమైనదని కుటుంబాన్ని పోషించుకోవడం



కోసం ప్రభుత్వాలు ఏమాత్రం సహాయం చేయకుండా ఎలాగోలా తన శక్తి మేర కుటుంబాన్ని బతికించుకోవడం కోసం డ్రైవర్గా అవతారం ఎత్తితే అక్కడినుంచి డైరెక్ట్ గా జైలుకు వెళ్లే విధంగా చట్టం తీసుకురావడం దుర్మార్గమని, రాబోయే కాలంలో ఈ ప్రభుత్వం డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని, ప్రతి 50 కిలోమీటర్లకు విశ్రాంతి తీసుకోవడం కోసం విశ్రాంతి భవనాలను ఏర్పాటు చేయాలని, డ్రైవర్లకు కనీసం వేతనం అమలయ్యేలా ప్రభుత్వం యజమానులపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు . రాబోయే కాలంలో డ్రైవర్లను కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటం నిర్వహించి డ్రైవర్ల జీవితాలతో చెలగాడ మాడే ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని గతంలో రైతుల పోరాటం ఏ విధమైన ఉధృతికి దారితీసిందో ఆస్ఫూర్తితో పోరాటాలు సాగించాలని ,రైతు దేశానికి వెన్నెముక అని ఏ విధంగా అంటామో ఖజానా లో ట్రాన్స్పోర్ట్ రంగం ప్రభుత్వానికి వెన్నెముక లాంటిదని ఇటువంటి రంగాన్ని నిర్వీర్యం చేస్తే ప్రభుత్వం పాలన సాగించడం కష్టమవుతుందని, డ్రైవర్లు అంత ఏకమై ఆందోళనల కు పూనుకుంటే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఏర్పడుతుందని, ప్రభుత్వం పునరాలోచించు కోవాలని హెచ్చరించారు భారత న్యాయ సంహిత చట్టం 106(1),2 లను రద్దు చేసేంతవరకు రాబోయే కాలంలో ఆలిండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ నంద్యాలలో అక్టోబర్ 19,20 తేదీలలో రెండు రోజులపాటు జరిగే రాష్ట్ర వర్క్ షాప్ లో తీసుకునే నిర్ణయాల్లో డ్రైవర్లంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## మహానందిలో ఉన్నతాధికారి

# ప్రోటోకాల్ అపహాస్యం



ఆంధ్ర ప్రగతి మహానంది అక్టోబర్ 16 మహానంది క్షేత్రంలో ప్రోటోకాల్ అపహాస్య పాలు అయినట్లు విశ్వసనీయ సమాచారం. ఒక అత్యంత ఉన్నత స్థాయి అటవీశాఖ అధికారి శ్రీశైలం టైగర్ ప్రాజెక్ట్ అభయారణ్య కన్జర్వేటర్ మహానంది క్షేత్రానికి దైవ దర్శనార్థమై వచ్చారు. కానీ నంద్యాల డివిజన్ కు చెందిన ఒక అటవీశాఖ అధికారి ఉన్నతాధికారి వెంట వచ్చిన ఆలయం బయటే ఉండి క్రింది స్థాయి




సిబ్బందిని మాత్రం లోపలికి పంపి పూజా కార్యక్రమాలు నిర్వహించి మమ అనిపించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో మతలబు ఏమంటే ఆ ఉన్నత స్థాయి అధికారి వాహనంతో పాటు నంద్యాల డివిజన్ అధికారి కూడా వాహనాన్ని లోనికి ఆలయ ముందు భాగానికి తీసుకొని వచ్చి ఉన్నతాధికారి వాహనం పక్కనే వాహనాన్ని నిలిపారు. అసలు ఆ అధికారి ఉన్నత స్థాయి అధికారి వెంట ఎందుకు వచ్చారు ఆలయం బయట మండపాల్లో వర్షానికి తడవకుండా నిలబడి ఎందుకు ఉన్నారు అనేది చర్చనీయాంశంగా మారినట్లు తెలుస్తుంది. వర్షంలో కూడా కింది స్థాయి సిబ్బంది ఉన్నత స్థాయి అధికారి వెంట ఉన్న ఈ అధికారి మాత్రం తనకు ఏమి పట్టినట్లు వ్యవహరిస్తూ ఆలయ మండపాల వద్ద తమ క్రింది స్థాయి ఒకరిద్దరితో సిబ్బందితో కాలక్షేపం చేస్తూ వర్షానికి తడవకుండా గొడుగు పట్టించుకొని తన అహంభావాన్ని చాటుకున్నారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. అక్కడ సీసీ కెమెరాలు ఉన్నాయని అధికారి గమనించినట్లు లేదని సమాచారం. ఈ వ్యవహారం అంతా క్షేత్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో నమోదయింది. దీనిపై అటవీశాఖ అధికారులు ఎలాంటి చర్యలు చట్ట పరంగా తీసుకుంటారు అనేది తేలాల్సి ఉంది.ం

# ఏబీ వెంకటేశ్వరరావుకు భారీ ఊరట

## కేసులు ఉపసంహరిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

అమరావతి,అక్టోబర్16ఆంధ్ర ప్రగతి :



గత వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు (ఏబీవీ)కి భారీ ఊరట లభించింది. ఏబీవీపై ఉన్న కేసుల్లో రెండింటిని ఏపీ సర్కార్ ఉపసంహరించుకుంది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మరో కేసుపై సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పని చేసిన ఏబీ వెంకటేశ్వరరావు వైసీపీ సర్కార్ లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. నిఘా పరికరాల కొనుగోళ్లలో అవినీతి జరిగిందన్న అభియోగంతో జగన్మోహనరెడ్డి సర్కార్ ఆయనను సస్పెండ్ చేసింది. కేసులు నమోదు చేయడంతో పాటు సర్వీస్ నుండి డిస్మిస్ చేయాలంటూ కూడా కేంద్రానికి సర్కార్ ప్రతిపాదనలు పంపింది. 2019 నుండి ఐదేళ్ల పాటు సస్పెన్షన్లు, కేసులు, క్రమశిక్షణా చర్యలు ఎదుర్కుంటూనే న్యాయపోరాటం చేసిన ఏబీవీ చివరకు పదవీ విరమణకు ఒక్క రోజు ముందు పోస్టింగ్ దక్కించుకుని మే 31న ప్రింటింగ్ అండ్ స్టేషనరీ డీజీగా గౌరవ ప్రదంగా పదవీ విరమణ అయ్యారు.కాగా, అఖిలభారత సర్వీస్ అధికారుల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించి పెగాసెస్, వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించిన వ్యవహారాల్లో ఏబీ వెంకటేశ్వరరావు మీడియాతో మాట్లాడారని వైసీపీ సర్కార్ అభియోగాలను నమోదు చేసింది. అయితే నిబంధనల ప్రకారం ఆరు నెలల్లోగా విచారణ పూర్తి చేయాల్సి ఉండగా, ఏడాదిన్నర అవుతున్నా ప్రభుత్వం విచారణ పూర్తి చేయకపోవడంతో ఆ అభియోగాలు వీగిపోయాయి. ఈ క్రమంలో అప్పట్లో ఏబీ వెంకటేశ్వరరావుపై నమోదు చేసిన ఆ అభియోగాలను ఉపసంహరించుకుంటూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.